

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ బిక్కునాయక్

సమగ్ర నివేదికలతో సమావేశాలకు హాజరుకావాలి

● జడ్పీ వైస్ చైర్మన్ బిక్కునాయక్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 25 : అధికారులు సమగ్ర నివేదికలతో సమావేశాలకు హాజరుకావాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ధనావత్ బిక్కునాయక్ అన్నారు. పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మూడో స్థాయి సంఘం(వ్యవసాయం) సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు వాటికి పరిష్కారానికి చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు వివరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కంకర మిల్లులపై చర్యలు చేపట్టాలని సూచించారు. క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. సమావేశానికి ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులు క్రమంతప్పకుండా హాజరుకావాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి టై అండ్ డై అసోసియేషన్ ప్రతినిధుల వినతి

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న టై అండ్ డై అసోసియేషన్ ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25 : పోచంపల్లిలో వస్త్ర దుకాణాలపై దాడి చేసి అవగాహణ రాహిత్యంతో మాట్లాడిన రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ టై అండ్ డై అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భువనగిరిలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, ప్రధాన కార్యదర్శి భారత లవకుమార్ మాట్లాడుతూ పోచంపల్లి వస్త్ర దుకాణాల్లో నకిలీ ఇక్కత్ వస్త్రాలు విక్రయించడంలేదన్నారు. అధికారుల అవగాహన రాహిత్యంతో చేనేత వస్త్రాలను ప్రింటెడ్‌గా చూపిస్తూ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని, దీంతో చేనేత పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. పోచంపల్లికి ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు ఉందని, అవగాహన లేకుండా అధికారుల తనిఖీతో ఆ ఖ్యాతి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టై అండ్ డై అసోసియేషన్ ప్రతినిధులు ముస్కూరి నర్సింహ, సీత లక్ష్మణ్, రాపోలు శ్రీనివాస్, సురపల్లి రాము, కుడికాల రామనరసింహ, గుండు ఉప్పలయ్య, పాలాది యాదగిరి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతు బంధు డబ్బులు విడుదల చేయాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

భువనగిరి అర్బన్, జనవరి 25 : పెండింగ్‌లో ఉన్న రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భువనగిరి మండలంలో కొనసాగుతున్న భూ పంపిణీని ఎత్తివేయాలన్నారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాలకు లింకు రోడ్ల సమస్యలు, కాల్వలపైన బ్రిడ్జిల నిర్మాణం లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే పూర్తి చేయాలని కోరారు. బసవపురం ప్రాజెక్టు నుంచి వడపర్తి కత్వాలోకి నీటిని తీసుకురావాల్సిన ప్రతిపాదనను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజల యొక్క సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 5న నుంచి 25 వరకు సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, కార్యదర్శి వర్గ సభ్యులు కొండ అశోక్, కొండ మడుగు నాగమణి, మండల కమిటీ సభ్యులు రాసాల వెంకటేశ్, మోటె ఎల్లయ్య, అబ్దుల్లాపురం వెంకటేశ్, పాండాల మైసయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం

● కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్

ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోటకొండూర్, జనవరి 25 : కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేశ్‌యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి రేగు రమేశ్ అన్నారు. భారత్ జూడో న్యాయ యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ నాయకుల దాడికి వ్యతిరేకంగా గురువారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భువనగిరి ఎల్లయ్య, వంగ శివ, బుగ్గ సిద్ధులు, యువజన కాంగ్రెస్ నాయకులు భూమండ్ల బంగారి, గజరాజు సురేశ్, కాంబోజు పరశురాం, మహేశ్, మహేశ్ పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' చట్టాన్ని రద్దు చేయాలి

● ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లేశం

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 25 : రవాణా రంగ డ్రైవర్లను కఠినంగా శిక్షించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఉమర్, దేవయ్య, జిల్లా సహాయ కార్యదర్శి గ్యార సురేశ్, జిల్లా కోశాధికారి గొడ్డెటి యాదగిరి, సీఐటీయూ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన కలిగి ఉండాలి

● కలెక్టర్ హనుమంతు కె జెండగే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 25 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టార్ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హనుమంతు కె జెండగే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ హెడ్ క్వార్టర్ తాసీల్దార్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ హెడ్ క్వార్టర్ పరిధిలోకి యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, జనగాం, రంగారెడ్డి జిల్లాల నుంచి ఆలేరు, భువనగిరి, జనగాం, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, ఇబ్రహింపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా ఉంటారని, గతంలో అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులుగా పని చేసిన వారు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెక్టార్ రూట్ మ్యాప్ రూపొందించాలని, సంబంధిత పోలీస్ అధికారులతో చర్చించి మ్యాపింగ్ తయారు చేసి నిర్ణీత ఫార్మెట్‌లో ఏఆర్‌ఓలకు పంపించాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈవీఎం యంత్రాల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారత ఎన్నికల సంఘం సీఈఓ రాజీవ్‌కుమార్ సందేశాన్ని స్క్రీన్‌పై ప్రదర్శించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అలాగే ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు సంబంధించిన 16 మంది ఉత్తమ బూత్ లెవెల్ ఆఫీసర్లను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, తాసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

భువనగిరి అర్బన్ : విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ హనుమంతు కె జెండగే అన్నారు. గురువారం పట్టణంలోని బాగాయత్ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 240 మంది విద్యార్థులకు యువ టీం సమకూర్చిన రూ.1.6లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం టీజీ యూఎస్ ఆధ్వర్యంలో ముంద్రించిన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ కె.నారాయణరెడ్డి, కుంభం కీర్తిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సింహ, పాశం కృష్ణమూర్తి, యువ టీం సభ్యులు పచ్చిమట్ల రాజు, పాశం కృష్ణమూర్తి, కరిపే సురేశ్, కిశోర్, సన్నీ, హరీశ్, సాయితేజ, ప్రణయ్, రుత్విక్, సాయి చరణ్, నితీశ్, పాండురంగాచారి, వరుణ్, పరిమళ్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు భువనగిరిలో ట్రాక్టర్ల ర్యాలీ

భువనగిరి అర్బన్, జనవరి 25 : బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం భువనగిరిలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక మతతత్వ విధానాలతో ప్రజల జీవన ఆదాయం పడిపోయిందని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర చట్టం చేయాలని కోరుతూ జిల్లాలోని రైతులు, కార్మికులు, కూలీలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనర్సింహారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 25 : చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్‌గా మందడి లక్ష్మీనర్సింహారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతేడాది అక్టోబర్ 5న హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చినందున ఆయన తిరిగి బాధ్యతలు చేపట్టారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ : సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ, జనవరి 25 : ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు కూలీల సంఖ్యను పెంచి ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు నిర్మించి మొక్కలు నాటాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలు చనిపోకుండా నీరందించాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచడానికి బాధ్యతాయుతంగా పని చేయాలని చెప్పారు. అనంతరం మండలంలోని అక్కంపల్లిలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. సమీక్షలో ఎంపీడీఓ గీతారెడ్డి, ఏపీడీ శ్యామల, డీఎల్‌పీఓ సాధన, ఎంపీఓ కేధారీశ్వర్, ఏపీఓ పరశురాం పాల్గొన్నారు.

గ్రంథాలయాల సెస్ బకాయిలను క్లియర్ చేయాలి

భువనగిరి కలెక్టరేట్ : జిల్లాలోని గ్రంథాలయాలకు రావాల్సిన మున్సిపల్, పంచాయతీ సెస్ బకాయిలను క్లియర్ చేయాలని జిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ 2024-25 సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించి మాట్లాడారు. పాఠశాలల విద్యార్థులు వారానికి ఒక రోజు గ్రంథాలయాన్ని సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్, డీఈఓ నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : అవగాహన కల్పిస్తున్న డీటీఓ రవీందదర్

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

భువనగిరి అర్బన్, జనవరి 25 : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ అధికారి జి.రవీందర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, మద్యం సేవించి ఆటోలను నడుపరాదని సూచించారు. ఆటో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల కోసం రవాణా శాఖ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని, ఆటోల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. అనంతరం డీటీఓ రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గనబోయిన వెంకటేశ్, సామల భాస్కర్, నాయకులు జిన్న నర్సింహ, గణేశ్, సాయి, సురేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీశైలం, చంద్రయ్య, డానియల్, వెంకటేశ్, నరేశ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ఎస్ఐ విక్రమ్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ శ్రీను, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), జనవరి 25 : మండలంలోని కొరటికల్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త సయ్యద్ చాంద్‌పాషా కూతురు వివాహానికి పార్టీ రాష్ట్ర నాయకుడు, కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో సమకూర్చిన రూ.10వేలను గురువారం పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల సత్తయ్యగౌడ్, మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు నరుకుడుబిందెల సైదులు, చుంచు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు దారం ఆంజనేయులుగుప్తా, బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు, చంద్రయ్య, స్వామి, మధుసూదన్, ఇస్తారి పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఫార్మర్స్ డే

బొమ్మలరామారం, జనవరి 25 : మండలంలోని రాంలింగంపల్లి నలంద హైస్కూల్‌లో గురువారం ఫార్మర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, నృత్య ప్రదర్శన నిర్వహించి బహుమతులు అందజేశారు. సేంద్రియ కూరగాయల సంతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నుముక లాంటివారని, ఆర్థిక చేయూతనందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యంజాల కళ, ఎంపీటీసీ ఎర్ర హేమంత్‌రెడ్డి, నలంద పాఠశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌గుప్త, జలాల్‌పురం కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ పెండెం నాగార్జున, హెచ్ఎం ప్రీతి పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

ఆత్మకూరు(ఎం), జనవరి 25 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన దుస్తులను గురువారం వసతిగృహం అధికారి దీరావత్ రాజాలుబాయి పంపిణీ చేశారు. ప్రభుత్వం సౌకర్యాలను వినియోగించుకొని పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

కోనేరు పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ పుష్పలతామల్లారెడ్డి

కోనేరు నిర్మాణ పనులు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25 : మండలంలోని కనుముక్కులలో గల పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోనేరు నిర్మాణ పనులను జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాక నరసింహాయాదవ్, ప్రముఖ వ్యాపారవేత్త కోట అభిలాశ్‌రెడ్డి, నాయకులు గొట్టం వెంకటరామిరెడ్డి, బాంధవి, హవ్యాస్‌రెడ్డి, హతర్వురెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మోటకొండూర్ గురుకుల విద్యార్థుల ప్రతిభ

మోటకొండూర్, జనవరి 25 : ఎస్‌వీఈఈపీ-2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా అక్టోబర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎన్నికల అవగాహన పోటీల్లో యంగ్ ఓటర్స్ స్కిట్ విభాగంలో మోటకొండూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి సాధించారు. గురువారం కూకట్‌పల్లిలోని ఆడిటోరియంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ జ్యోతి అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు

జీవో 55ను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

భువనగిరి అర్బన్, జనవరి 25 : హైకోర్టు కోసం అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను కేటాయించే పద్ధతిని వెనక్కి తీసుకోవాలని, జీవో 55ను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టు నిర్మాణానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్శిటీ భూములను 100 ఏకరాలు కేటాయించడం అన్యాయమన్నారు. యూనివర్శిటీ ముందు గత 16 రోజులుగా ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పారు. యూనివర్సిటీని సంప్రదించకుండా హైకోర్టు నిర్మాణానికి నిర్ణయం తీసుకురావాడాన్ని ఖండిస్తున్నామన్నారు. జీవో నంబర్ 55ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లావుడియా రాజు, వేముల నాగరాజు, భువనగిరి పట్టణాధ్యక్షుడు ఈర్ల రాహుల్ పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో రంగు కాగితాలు అంటిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

గణతంత్ర వేడుకలకు కార్యాలయాలు ముస్తాబు

ఆత్మకూరు(ఎం), జనవరి 25 : గణతంత్ర దినోత్సవ వేడుకలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు గురువారం ముస్తాబు చేశారు. రంగురంగుల కాగితాలు, మామిడితోరణాలతో అందంగా తీర్చిదిద్దారు.

మంత్రి కోమటిరెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి : పాండరి

వలిగొండ, జనవరి 25 : రైతు బంధు రాలేదు అన్న వాళ్లని చెప్పుతో కొట్టాలన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు డేగల పాండు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధ్యత గల పదవిలో ఉంటూ ఇలాంటి వాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రుణమాఫీ, రైతు బంధు వాగ్దానాలు మరిచి రైతులను కించపరుస్తూ మాట్లాడిన మంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది

● ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

భువనగిరి కలెక్టరేట్ : అనాజీపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 25 : ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షురాలు గునుగుంట్ల కల్పనాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అనాజీపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల సంఘం మాజీ చైర్మన్ ఏదునూరి మల్లేశం, పంచాయతీ సెక్రటరీ బట్టు స్వాతి, అంగన్‌వాడీ టీచర్ జానకి పాల్గొన్నారు.

గుండాల : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ తాండ్ర అమరావతీశోభన్‌బాబు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, ఆర్ఐ నరేశ్, ప్రధానోపాధ్యాయుడు గిరివర్ధన్ పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏలే చంద్రశేఖర్, బందారపు లింగస్వామి, గండికోట హరికృష్ణ, అమరేందర్, మత్స్యగిరి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 విద్యార్థులు ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట విజయభాస్కర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దుర్గం సాయివర్ధన్, జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : మండలంలోని రాళ్ల జనగాంలో సర్పంచ్ తెల్జిరి శ్రీశైలం, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, బీఎల్ఓ మాలతి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలేరు : ఆలేరులో ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్, ప్రధానోపాధ్యాయురాలు శ్యామసుందరి, నాయబ్ తాసీల్దార్ ప్రణయ్, ఆర్ఐలు సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరచారి, కిష్టు, సైదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని గట్టు శ్రీరాములు ఫంక్షన్‌హాల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. పీవీ శ్యామ్‌సుందర్, రమనగోని శంకర్, దూడల భిక్షంగౌడ్, చింతకింది కిశోర్ పాల్గొన్నారు.

రామన్నపేట : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తాసీల్దార్ శివగణేశ్ తెలిపారు. గురువారం తాసీల్దార్ కార్యాలయంలో ప్రత